క్లుప్తంగా

ఆర్టీసీ బస్టాండ్‌లో కుర్చీల ఏర్పాటు



ఏర్పాటు చేసిన కుర్చీలను చూపుతున్న డీఎం నాగరాజు

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం గురువారం కుర్చీలు వచ్చాయని డిపో మేనేజర్ నాగరాజు తెలిపారు. కోవెలకుంట్ల నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు బస్టాండ్‌లో ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించేందుకు ఇబ్బందులు పడకుండా 15 కుర్చీలు మంజూరు కాగా వాటిని బస్టాండ్‌లో ఏర్పాటు చేశామని చెప్పారు. ఎన్‌ఎంయూ నాయకులు శివరాం, నరసింహులు, ఆచారి పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

డోన్: పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు హాజీమస్తాన్ వంద పడకల ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులు, రోగులు, బాలింతలకు గురువారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ హనీఫ్, స్వచ్ఛంధ సంస్థ నిర్వాహకులు జాన్‌ప్రభాకర్ పాల్గొన్నారు.

రేపు మీరావలి జార్తలు



మీరావలి పీరు

కోవెలకుంట్ల: మండలంలోని ఎం. గోవిందిన్నె మెట్ట మీద వెలసిన మీరావలి దర్గా జియారత్ పూజలకు ముస్తాబవుతోంది. మొహర్రం ముగిసిన 40 రోజున జార్తలు నిర్వహించడం ఆనవాయితీ. శనివారం జియారత్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. దర్గా కమిటీ అధ్యక్షుడు సత్యరాజు ఆధ్వర్యంలో పూజలు జరుగనున్నాయి. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై మీరావలికి ప్రత్యేక ఫతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకోనున్నారు.


వ్యక్తిగత పరిశుభ్రత అవసరం



విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బేతంచెర్ల: విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవడమే గాకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని శేషారెడ్డి సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సాగరిక సూచించారు. ఈనెల 2న ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో గురువారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రిన్సిపాల్ అబీదా బేగం ఆధ్వర్యంలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు ప్రియాంక, తస్లీమా, గాయత్రి పాల్గొన్నారు.

స్వామినాథన్‌కు ఘన నివాళి



ఎంఎస్ స్వామి నాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: హరిత విప్లవ పితామహుడు భారతరత్న డాక్టర్ స్వామి నాథన్‌కు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఎంఎస్ స్వామి నాథన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, వ్యవసాయ రంగానికి చేసిన సేవలను కొనియాడారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



మాట్లడుతున్న హౌసింగ్ ఏఈ బాలచంద్రుడు

సంజామల: ఇళ్ల నిర్మణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ రామసుబ్బయ్య సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్ ఏఈ బాలచంద్రుడుతో కలిసి ఇంజినీర్ అసిస్టెంట్లతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లడుతూ..మండలంలోని లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలని, అలా చేసుకున్న వారికే నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. ఇంజినీర్ అసిస్టెంట్లు,వర్క్ఇన్‌స్పెక్టర్లు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈఓఆర్‌డీ రాధికారెడ్డి,ఏపీఓ పాల్గొన్నారు.



మదనంతపురంలో భారీగా ప్రహిస్తున్నవాగు



నేల బెలుంలోకి చేరుతున్న వర్షపు నీరు

కుండపోత!


- ఉప్పొంగిన వాగులు, వంకలు



వెలగటూరు సమీపంలో మొక్కజొన్న పైరులో చేరిన వర్షపునీరు

కోవెలకుంట్ల: ఉపరితల ఆవర్తన ప్రభావంతో గురువారం స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత, ఉక్కపోత అధికంగా ఉండి మధ్యాహ్నానికంతా వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకుని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల మండలాల్లో వర్షం కురిసింది. కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ పంటలకు ఊరటనిస్తుండగా, ఈ నెలలో సాగు చేయాల్సిన పంటలకు అనుకూలంగా మారిందని రైతులు పేర్కొంటున్నారు.

- **కొలిమిగుండ్ల:** ఉపరితల ఆవర్తన ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లో గురువారం కుండపోత వర్షం కురిసింది. కనకాద్రిపల్లి,రాఘవరాజుపల్లి,అంకిరెడ్డిపల్లె మదనంతపురం బందర్లపల్లె తుమ్మలపెంట గ్రామాల్లో భారీ వర్షం కురవడంతో వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహించాయి.అంకిరెడ్డిపల్లెలో వాగునీరు ప్రధాన రహదారి మీదుగా ఎస్సీ కాలనీకి చేరడంతో కాలనీ వాసులు అవస్థలు పడ్డారు. రాఘవరాజుపల్లెలో వాగువద్ద బట్టలు ఉతికేందుకు రజకులు ఏర్పాటు చేసుకున్న బొగ్గులు, డ్రమ్ములు కొట్టుకుపోయాయి. బందర్లపల్లె సమీపంలోని పురాతన నేల బెలుం మల్లేశ్వరస్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న బిలంలోకి వర్షపు నీరు పెద్ద ఎత్తున చేరాయి. తుమ్మలపెంటలో కురిసిన భారీ వర్షానికి దేవర కోన జలపాతానికి భారీగా నీరు చేరింది. మిగిలిన గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది.



బనగానపల్లె సమీపంలో బీటలు వారిన ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వ లైనింగ్

పొంచి ఉన్న ప్రమాదం!

- ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వ లైనింగ్‌కు బీటలు
- ముప్పు వాటిల్లే అవకాశం
- పట్టించుకోని అధికారులు

బనగానపల్లె : గోరుకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయర్ వరకు సుమారు 60 కి.మీ. పొడవున ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వ చాలా కాలంగా అభివృద్ధికి నోచుకోక కాల్వకు ఇరువైపుల ఉన్న లైనింగ్ పలు ప్రాంతాల్లో బీటలు బారడంతో కాల్వ ఉనికి ప్రమాదకరంగా మారిందని రైతులు పేర్కొంటున్నారు. కాల్వకు అనుసంధానంగా మొత్తం 16 బ్లాక్‌లు ఉండగా 1.62 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందుతుంది.. ఆయకట్టుకు సాగునీరు సక్రమంగా అందాలంటే ప్రధాన కాల్వ పూర్తిస్థాయిలో అభివృద్ధిలో చేయాలి. నిబంధనల ప్రకారం సంబంధిత ఇంజినీరింగ్ ఉన్నతాధికారుల వివరణ మేరకు ఏటా కాల్వను అన్ని విధాలుగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలి. కాల్వకు ఇరువైపుల ముళ్లపొదలు ఉండరాదు. కాల్వకు ఇరువైపుల కట్టభాగాన్ని రహదారిగా ఉపయోగించకూడదు. అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా ఈ నింబంధనలు అమలుకు నోచుకోవడం లేదు. అలాగే..అవసరమైన నిధులు మంజూరు కావడంలేదు. దీంతో కాల్వ లైనింగ్ చాలా ప్రాంతాల్లో బీటలు వారి పడిపోయే దశకు చేరుకుంది. యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కాల్వకు గండ్లు పడే ప్రమాదముందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం





తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సభ్యులు, బాలింతలకు సూచనలిస్తున్న ఐసీడీఎస్ సైపర్‌వైజర్ పావని

డోన్: తల్లిపాలే బిడ్డలకు శ్రేయస్కరమని ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు శకుంతలారెడ్డి అన్నారు. దొరపల్లె గ్రామంలోని పొదుపు భవనంలో గురువారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కల్పించారు. ప్రాజెక్టు సీహెచ్‌ఓ ధనలక్ష్మి తల్లిపాల ప్రాముఖ్యత, రోగ నిరోధక శక్తి గురించి అవగాహన కల్పించారు. దివంగత డాక్టర్ సీతారామయ్య సతీమణి సూర్యకుమారి పొదుపు మహిళలు, బాలింతలకు కోడిగుడ్లు, బ్రెడ్లు, పాల ప్యాకెట్లు, బత్తాయి పండ్లను పంపిణీ చేశారు.

- **అవుకు:** పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టించడమే శ్రేయస్కరమని ఐసీడీఎస్ సైపర్‌వైజర్ పావని సూచించారు. గురువారం స్థానిక 9వ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పుట్టిన గంటలోపు బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని, ఇవి బిడ్డకు సంజీవని లాంటివన్నారు. వీటితో శిశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగడంతో పాటు అంటు వ్యాధులు సోకవని చెప్పారు. ఏఎస్ఎం జ్యోతి, ఎంఎల్‌హెచ్‌పి పర్వానా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త లక్ష్మీప్రియ

ముర్రుపాలులో రోగనిరోధక శక్తి

బనగానపల్లె రూరల్ : పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టాలని, వాటి నుంచి శిశువుకు రోగ నిరోధక శక్తి లభిస్తుందని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) గృహ విజ్ఞాన శాస్త్రవేత్త లక్ష్మీప్రియ అన్నారు. గురువారం పట్టణంలోని సచివాలయం–5లో తల్లిపాల వారోత్సవల సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు,బాలింతలు పౌష్టిహారం తీసుకోవాలని చెప్పారు. సూపర్‌వైజర్ నాగసుంకమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు



బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్: తన కుమారుని వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలియజేశారు. నూతన వధూవరులు అర్జున్ అమర్నాథ్‌రెడ్డి, అనన్యరెడ్డిలను ఆశీర్వదించేందుకు మాజీ సీఎంతో పాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజలందరికీ బుగ్గన ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మెల్సీపై దాడి అమానుషం

కోవెలకుంట్ల: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ, ఆ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ యాదవ్‌పై టీడీపీ గూండాల దాడి అమానుషమని సంజామల మండల ఉపాధ్యక్షుడు, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నబాబు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా నల్లగొండవారి పల్లి గ్రామ పర్యటనలో ఎమ్మెల్సీ కారును అడ్డగించి టీడీపీకి చెందిన కొందరు గూండాలు దాడికి పాల్పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీలను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, నిందితులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి

డోన్ టౌన్: గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని జేసీ నవ్య, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు గ్రామ సచివాలయాల సెక్రటరీలకు సూచించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో గురువారం కుడా అధికారులు మోహన్‌కుమార్, విజయభాస్కర్, హేయత్ మొహిద్దీన్‌లు గ్రామ సచివాలయాల సెక్రటరీలకు భవన నిర్మాణ లే అవుట్లపై అవగాహన కల్పించారు. అనంతరం జేసీ, కుడా చైర్మన్ మాట్లాడారు. ఏవైనా రాజకీయ ఒత్తిళ్లు ఎదరైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

డోన్ టౌన్: చేనేతలను ఆదుకోవాలని కుర్నికుల (నేసే)సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షులు బందికె హరిప్రసాద్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సంఘం కార్యాలయంలో గురువారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు మైలే లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ దేవరాయ పట్టాభిషేక మహోత్సవం



శ్రీకృష్ణదేవరాయ విగ్రహానికి పూలమాలవేస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్ :పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలోని పోర్ట్‌లైన్స్ రోడ్డుపై ఉన్న శ్రీకృష్ణదేవరాయ విగ్రహం వద్ద బనగానపల్లె శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం ఆధ్వర్యంలో శ్రీ కృష్ణదేవరాయుల 516వ పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించాది. ఈ సందర్భంగా పలువురు బలిజ సంఘం నాయకులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘస్తులు సూర రామసుబ్బయ్య, నీలి శ్రీనివాసులు, కూరాకుల రామసుబ్బయ్య,యు రాజశేఖర్,అంగడి కృష్ణ,మధు పాల్గొన్నారు.



శ్రీకృష్ణ దేవరాయల చిత్రపటానికి పూల మాలలు వేస్తున్న బలిజ సంఘం నాయకులు

శ్రీకృష్ణ దేవరాయలు మంచి పాలనాదక్షుడు

బేతంచెర్ల: శ్రీకృష్ణ దేవరాయలు మంచి పాలనాదక్షుడని బలిజ సంఘం నాయకులు నాగమోహన్, సుబ్బారెడ్డి, హరికృష్ణ, కౌషిక్ అన్నారు. గురువారం పాత బస్టాండులో బలిజ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ దేవరాయల పట్టాభిషేక మహోత్సవం సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేశారు. కవులను, కళాకారులను పోషించిన మహోన్నత వ్యక్తి కృష్ణ దేవరాయలు అని కొనియాడారు.

సంక్షిప్తం

16 నుంచి శ్రీకృష్ణాష్టమి వేడుకలు



సీఐకి ఆహ్వానపత్రిక అందజేస్తున్న కమిటీ సభ్యులు

ప్యాపిలి: త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు శివప్రసాద్, సుధాకర్ నాయుడు, రమేశ్, విశ్వనాథ్ తదితరులు తెలిపారు. గురువారం వారు స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ వెంకటరామిరెడ్డి, జలదుర్గం ఎస్ఐ నాగార్జునను కలసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్యాపిలి, హుసేనాపురం, జలదుర్గం గ్రామాల్లో ఈనెల 16న శ్రీకృష్ణుని ప్రతిమను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వారం రోజుల పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించిన తర్వాత ఊరేగింపుతో వేడుకలు ముగుస్తాయన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

డోన్ టౌన్: పట్టణంలోని కృష్ణనగర్‌లో రూ.14 లక్షల వ్యయంతో చేపట్టిన నూతన మంచినీటి పైపులైను నిర్మాణ పనులకు గురువారం ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం కోట్ల విజయభాస్కర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. పట్టణంలోని డాక్టర్ పోచా ప్రభాకర్‌రెడ్డి కాలనీకి చెందిన బుడగ జంగాల విద్యార్థికి గుండె చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.25 లక్షల విలువైన ఎల్‌ఓసీని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

క్రమశిక్షణ ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది

డోన్ టౌన్: క్రమశిక్షణతో కూడిన జీవితం అలవాటు చేసుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని వివేకానంద సేవా సమితి వ్యవస్థాపకులు జగన్‌మోహన్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు సర్వజ్ఞమూర్తి అన్నారు. గురువారం బీసీ బాలికల హాస్టల్‌లో నిర్వహించిన ఫ్రెషర్స్ డేలో వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని అందుకు అనుగుణంగా చదువుకోవాలన్నారు. వివేకానంద సేవా సమితి ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులశెట్టి, సభ్యులు శ్రీనివాసకుమార్, సాయినాథ్‌తో పాటు హాస్టల్ వార్డెన్ మేరి సూర్యకుమారి పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

అవుకు: మండలంలోని రామాపురంలో 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ లింగమయ్య గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన కావేరి సాయిబాబా ఆలయం వద్ద సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకొని, రిమాండ్‌కు తరలించామని ఏఎస్ఐ చెప్పారు.

యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

డోన్ టౌన్: ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా పరిశ్రమలను నెలకొల్పి పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని జిల్లా పరిశ్రమశాఖ అధికారి మహబూబ్ బాషా యువతకు సూచించారు. స్థానిక స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో (జాడీల ఫ్యాక్టరీ) గురువారం పరిశ్రమల స్థాపన, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సబ్సిడీలు తదితర అంశాలపై నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించారు. సమావేశంలో డ్వామా ఏపీడీ నరసింహారెడ్డి, డోన్ పరిశ్రమల అభివృద్ధి అధికారి శివప్రసాద్ పాల్గొన్నారు.

మహిళల రక్షణకు కట్టుదిట్టమైన చట్టాలు



చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ గౌతమి

కోవెలకుంట్ల: మహిళల రక్షణకు కట్టుదిట్టమైన చట్టాలు అమలులో ఉన్నాయని నంద్యాల మహిళా పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గౌతమి తెలిపారు. గురువారం సాయంత్రం మండలంలోని అమడాలలో శక్తి టీం ఆధ్వర్యంలో గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 112, ఫోక్సోయాక్ట్, సైబర్ నేరాలకు సంబంధించిన టోల్‌ఫ్రీ నంబర్ 1930 గురించి వివరించారు. సీఐ మాట్లాడుతూ మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తే ఫోక్సోయాక్ట్ కింద కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే..బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆపద సమయంలో వినియోగించుకోవాలని చెప్పారు. కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, శక్తి టీం ఏఎస్ఐ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీలు సద్వినియోగం చేసుకోండి



చేనేత కళాకారుడిని సన్మానిస్తున్న అధికారులు

బనగానపల్లె రూరల్ : ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను చేనేత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా చేనేత, జౌలిశాఖ అభివృద్ధి అధికారి నరసింహారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నందవర్గం గ్రామ సచివాలయంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు చేనేత కళాకారులను సన్మాంచిన జ్ఞాపిక అందజేశారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఆ శాఖ అధికారి శ్రీవాణి, చేనేత కళాకారులు పాల్గొన్నారు.



జ్యోతిరావుపూలే పాఠశాలలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి

- సెట్కూర్ సీఈఓ డాక్టర్ వేణుగోపాల్

డోన్: మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని, వారి అడుగుజాడల్లో నడవాలని సెట్కూర్ సీఈఓ డాక్టర్ వేణుగోపాల్ యువతకు సూచించారు. యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో గుత్తి రోడ్డులోని జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో గురువారం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య వేడుకలను, అందుకు కారకులైన మహనీయులను స్మరించుకునేందుకు ప్రతి భారతీయుని ఇంటిపై మూడు రంగుల జెండాను ఎగురవేయాలన్నారు. జెండా ఒక చిహ్నం కాదని, అది మన దేశ ఐక్యతకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అరుణ, సెట్కూర్ సూపరింటెండెంట్ శ్యాంబాబు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడాలని సెట్కూర్ సీఈఓ వేణుగోపాల్ యువతకు సూచించారు. స్థానిక సాయిశ్రీ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో ఎంపికైన 102 మందికి నియామక పత్రాలను ఆయన అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మహేంద్రగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అరబిందో ఫార్మా, బజాజ్ ఆటో, ఎంఎస్‌సీ మొబైల్, మహింద్రా అండ్ మహింద్రా, రాజా బ్యాగ్స్, పేటీఎం, ఎస్‌బీఐ కార్డ్స్, ఎల్ అండ్ టి, ముత్తూట్ ఫైనాన్స్ సంస్థలు పాల్గొన్నాయి. నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి



ఉద్యోగులతో రాష్ట్ర ఎన్‌జీఓ సంఘం అధ్యక్షులు సూర్యనారాయణ

డోన్: రాష్ట్ర ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీ ఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలు తెలుసుకునేందుకు చేపట్టిన రండి ..టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఉద్యమించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి షంషాద్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

బేతంచెర్ల: స్మార్ట్ మీటర్ల బిగింపు, విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య, మండల కార్యదర్శి మధుశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం డోన్ రహదారిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం ఎదుట సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక తుంగలో తొక్కి ప్రజావ్యతిరేక విధానలను అవలంబిస్తున్నారన్నారు. ఇప్పటికై నా స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు రామాంజనేయులు పాల్గొన్నారు.